క్లుప్తంగా

మురుగునీరు పారకుండా చర్యలు

నారాయణఖేడ్: పట్టణంలోని మైనార్టీ బాలికల గురుకులం వద్ద మురుగునీరు రోడ్డుపై పారకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ రుబీనానజీబ్, వైస్ చైర్మన్ పరశురాం తెలిపారు. మురుగునీరు పారుతున్న విషయాన్ని తెలుసుకుని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురుగుకాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగిస్తామన్నారు. అనంతరం 10వ వార్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు.

'అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తాం'

హత్నూర(సంగారెడ్డి): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి రాజేశ్వర్ తెలిపారు. హత్నూర మండలంలోని దౌల్తాబాద్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఏ పార్టీతోనూ పొత్తు లేకుండా ఒంటరిగా పోటీ చేస్తుందన్నారు. ఇటీవల హైదరాబాద్ నిర్వహించిన సామాన్యుడి సమరభేరికి వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనట్లు గుర్తు చేశారు.

సీఐటీయూని గెలిపించండి



మాట్లాడుతున్న మల్లేశం

పటాన్‌చెరు టౌన్: కార్మికుల సంక్షేమం కోసం పాటుపడే సీఐటీయూని త్వరలో నిర్వహించనున్న కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూని గెలిపించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం కార్మికులకు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని అగర్వాల్ రబ్బర్ పరిశ్రమలో వచ్చేనెల 3న జరిగే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల సందర్భంగా పరిశ్రమ ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక పరిశ్రమల్లో కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలు, ఉద్యోగ భద్రత, సంక్షేమం కోసం పని చేస్తున్న సంఘం సీఐటీయూ అని తెలిపారు. చుక్క గుర్తుపై అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాండురంగారెడ్డి, నర్సింహారెడ్డి, రాజు, శ్రీనివాస్, రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని బోర్పట్ల గ్రామ శివారులోని పత్తి పంటలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధిక సాంద్రత పత్తి సాగుపై రైతులకు సలహాలు, సూచనలు చేశారు. అదేవిధంగా యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ రమేష్, డాక్టర్ వీరన్న జూపిత, ఏడీఏ అరుణ, కోఆర్డినేటర్ సరిత, సర్పంచ్ అంజమ్మ రైతులు శివరాంరెడ్డి, రాజిరెడ్డి, గంగారెడ్డి, ఏఈఓ ప్రేమ్‌రాజ్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించండి

జిన్నారం(పటాన్‌చెరు): ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని కౌన్సిలర్ చంద్రారెడ్డి సూచించారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని జ్యోతినగర్‌లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొపాజి అనంత కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందిరాపార్క్ వద్ద శనివారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య కార్పొరేషన్‌తో పాటు పేద ఆర్యవైశ్యులకు వైశ్యబంధు అమలు చేయాలన్నారు. ధర్నాలో సంగారెడ్డి ఆర్యవైశ్య సంఘం పట్టణ గౌరవాధ్యక్షుడు మ్యాడం రాధాకిషన్, అధ్యక్షుడు పాంపాటి కష్ణమూర్తి, కార్యదర్శి కొంపల్లి విద్యాసాగర్, కోశాధికారి పుల్లూరి ప్రకాష్, నాయకులు నామ భాస్కర్, అమేటి భాస్కర్, చిలమకూరి నరేంద్ర, కటుకం భాస్కర్ పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సంగారెడ్డి టౌన్: ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. సంగారెడ్డి తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మె చేపట్టి 20 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు వరలక్ష్మి, వీరమణి, శారద, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

పట్టణాలకు దీటుగా అభివృద్ధి



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పట్టణాలకు దీటుగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ గ్రామాల్లో జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సౌజన్యంతో రూ.7కోట్లతో చేపట్టిన సీసీ రోడ్లను ప్రజాప్రతినిధులతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంగా విస్తరిస్తున్న కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ గ్రామాల అభివృద్ధికి పదేళ్లలో రూ.14 కోట్లు కేటాయించి మౌలిక వస్తువులను కల్పించినట్లు తెలిపారు. అన్ని కాలనీల్లో అంతర్గత మురుగు కాలువలు, ఇంటింటికి మిషన్ భగీరథ కనెక్షన్లు అందించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు కృష్ణ, నితీశాశ్రీకాంత్, ఉపసర్పంచులు ఫహీం, జానకిజ్ఞానేశ్వర్, ఎంపీడీవో మల్లీశ్వర్, పంచాయతీరాజ్ డీఈ సురేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి పెద్దపీట

పటాన్‌చెరు టౌన్: బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు, రామచంద్రాపురం బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న తెలంగాణ వేదశాస్త్ర ప్రవర్తక సభ చతుర్వేద సదస్సు, తెలంగాణ విద్వత్ పరీక్షల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దంపతులు శనివారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి దంపతులు, బ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు..

పటాన్‌చెరు: దళారుల ప్రమేయం లేకుండా పారదర్శకతతో అర్హులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మూడో విడత డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 30వేలకు పైగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించినట్లు తెలిపారు. లబ్ధిదారులను ఎంపిక అనంతరం అర్హులైనవారికి అక్టోబర్ 2న అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయకుమార్, కార్పొరేటర్లు మెట్టు కుమార్‌యాదవ్, పుష్పనగేష్, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్ పాల్గొన్నారు.



జోగిపేటలో పొర్లుదండాలతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

వినూత్న నిరసన

వట్‌పల్లి(అందోల్): తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జోగిపేటలో శనివారం అంగన్‌వాడీలు పొర్లుదండాలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, అంగన్‌వాడీలు ఇందిర, శేఖమ్మ, పార్వతి, స్వరూప, శశికళ, శోభారాణి, హిమబిందు, అరుణ, జయమ్మ, బాలమణి, ఈశ్వరమ్మ, సాయమ్మ, సుమిత్ర, ప్రమీల, సావిత్రి పాల్గొన్నారు.

'ప్రభుత్వం స్పందించేవరకు సమ్మె కొనసాగిస్తాం'

సంగారెడ్డి టౌన్: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించేవరకు సమ్మె కొనసాగిస్తామని ఆ సంఘం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శశికళ అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సంగారెడ్డి తహసీల్దార్ కార్యాలయం ఎదుట భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు రజిత, లక్ష్మి, అనిత, శారద, సంతోష పాల్గొన్నారు.

20వ రోజుకు సమ్మె..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అంగన్‌వాడీ చేపట్టిన సమ్మె శనివారంతో 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

'సమ్మెను నిర్వీర్యం చేసేందుకు కుట్ర'

జహీరాబాద్ టౌన్: అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆ సంఘం యూనియన్ నాయకులు ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారంతో 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.హెచ్చరించారు. యూనియన్ నాయకులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులను పూర్తిచేయరా?

- కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జయమ్మ

సదాశివపేట (సంగారెడ్డి): ప్రభుత్వం పట్టణాభివృద్ధికి మంజూరు చేసిన రూ.25 కోట్ల స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ నిధులతో చేపట్టిన 3204 పనుల్లో 100 పనులను కూడా పూర్తి చేయలేదని, దీంతో సంబంధిత కాంట్రాక్టర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కౌన్సిలర్ కలీం పాటిల్ ప్రశ్నించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లోడు జయమ్మ అధ్యక్షతన శనివారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్ ఇంద్రమోహన్ గౌడ్ మాట్లాడుతూ పట్టణంలో చాలా ప్రాంతాల్లో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లతో ప్రమాదం పొంచి ఉందని, అధికారులు స్పందించి వెంటనే సరిచేయాలని కోరారు. కౌన్సిలర్ పిల్లోడు విశ్వనాథం, ఇలియాస్ షరీఫ్ మాట్లాడుతూ పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలు, కళాశాలల సమీపాల్లో ఉన్న కల్లు, బెల్ట్ దుకాణాలను తొలగించాలన్నారు. పట్టణంలో ఉన్న కుక్కల బెడదను నివారించాలని కౌన్సిలర్ ఓడెల రాజేశ్వరి కోరారు. పట్టణంలోని పాత ప్రభుత్వ ఆస్పత్రి ప్రైవేటు వాహనాలకు పార్కింగ్‌గా మారిందని, అక్కడ చిల్డ్రన్ పార్క్ నిర్మించాలన్నారు. ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల మహిళలు, ఆర్పీలు బాధ్యతలు మరిచి కమిషనర్ ముందే గొడవపడి కొట్టుకుంటుంటే చూస్తూ కూర్చుంటారా అని కమిషనర్ శ్రీనివాస్‌డ్డిని కౌన్సిలర్ వడ్ల మహేశ్వరి మండిపడ్డారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు, తదితర ఏజెండా అంశాలను సభ్యులు ఆమోదించారు. వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు చౌదరి ప్రకాష్, గుండు రవి, విద్యాసాగర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

- ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సిర్గాపూర్ మండలం గౌడ్‌గాం చౌరస్తా నుంచి కంగీ-నారాయణఖేడ్ డబుల్ రోడ్డు పక్కన శనివారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయమన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందని తెలిపారు. ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, నాయకులు మాధరావుపాటిల్, శ్రీనివాస్‌రావు, యాదవరావు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లోకి..



బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న చింతా ప్రభాకర్

కొండాపూర్(సంగారెడ్డి): అభివృద్ధిని చూసే యువత బీఆర్ఎస్‌లో చేరుతున్నారని రాష్ట్ర చేనేత సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని తమ్మలిబాయి తండాకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసే పార్టీలో చేరుతున్నారని తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకం విఠల్, సర్పంచ్‌లు శాంతిఅర్జున్ నాయక్, ఇంద్రారెడ్డి, షఫీ, ప్రకాష్, జగదీశ్వర్, ఎంపీటీసీలు రాందాస్, మోహన్ గౌడ్, సంతోష్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, మాజీ సర్పంచ్ రమాగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

పీసీబీ అధికారుల తనిఖీలు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం పారిశ్రామికవాడలోని వివిధ పరిశ్రమల్లో పీసీబీ అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. గుట్టు చప్పుడు కాకుండా రాత్రి సమయాల్లో వ్యర్థ జలాలను బయటికి వదులుతున్నారనే ఫిర్యాదులు రావటంతో అధికారులు వ్యర్థ జలాల నమూనాలను సేకరించారు. నమూనాల పరీక్షల అనంతరం పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

శ్రమదానం

నారాయణఖేడ్: పరిశుభ్రత-స్వచ్ఛతలో భాగంగా నారాయణఖేడ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎస్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు శ్రమదానం చేశారు. గుంతలమయంగా మారిన నిజాంపేట్- నారాయణఖేడ్-బీదర్ 161బీ జాతీయ రహదారిపై మట్టిని పోసి చదును చేశారు. అదేవిధంగా కళాశాల ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లయ్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శనివారం కార్పొరేటర్ పుష్పనగేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణాలను చేపడతామన్నారు. అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో దామోదర రాజనర్సింహా

సంగారెడ్డి మున్సిపాలిటీ: మండల కేంద్రం చౌటకుర్ గ్రామం నుంచి 15 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజానర్సింహా సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. చౌట్కూరు కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు రామగౌడ్, పర్కల రమేష్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు, మండల నాయకులు ఆగమయ్య, అంబెడ్, కృష్ణ పాల్గొన్నారు.

నాణ్యతా లోపం.. ప్రజలకు శాపం

- నిరుపయోగంగా హైమాస్ట్ లైట్లు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



ముంగి చౌరస్తా వద్ద నిరుపయోగంగా ఉన్న హైమాస్ట్ లైట్లు

న్యాల్‌కల్(జహీరాబాద్): లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు నాణ్యతా లోపం కారణంగా తక్కువ సమయంలోనే పాడైపోవడంతో ప్రధాన కూడళ్ల వద్ద చిమ్మచీకట్లు అలుముకున్నాయి. ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు.

మండలంలో గంగ్వార్, హద్నూర్, ముంగి, చాల్కి, న్యాల్‌కల్, మిర్జాపూర్(ఎన్), ఖలీల్‌పూర్, తాట్‌పల్లి, మల్గి, హుస్సెల్లి, గుంజోటి, శంశల్లాపూర్, చినిగెపల్లి, డప్పూర్, మల్గి, మిర్జాపూర్(ఎన్), వడ్డి తదితర ప్రధాన చౌరస్తా ప్రాంతాలున్నాయి. అక్కడ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసేందుకు తొమ్మిదేళ్ల క్రితం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో లైటు కోసం రూ.2 లక్షల చొప్పున 12 లక్షలు మంజూరు చేయగా ఆయా చౌరస్తాల వద్ద వాటిని ఏర్పాటు చేశారు. కానీ.. నాణ్యతా లోపంతో అనతి కాలంలోనే పాడైపోయాయి. దీంతో పరిసర ప్రాంతాలు చీకటిగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గంగ్వార్, హద్నూర్, చాల్కి చౌరస్తాల వద్ద తాత్కాలికంగా వేరే లైట్లు ఏర్పాటు చేశారు. ముంగి, రాఘవాపూర్ చౌరస్తాల వద్ద ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లైట్లకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

స్వామినాథన్ మరణం దేశానికి తీరని లోటు



స్వామినాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): భారత హరిత విప్లవ సారథి, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ మృతి దేశానికి తీరని లోటని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాదవరెడ్డి, రాజయ్య అన్నారు. మండల కేంద్రంలో సీపీఎం కార్యాలయంలో ఎమ్ఎస్. స్వామినాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1965 నుంచి 1985 వరకు హరిత విప్లవాన్ని కొనసాగించి దేశాన్ని స్వయం సమృద్ధిగా చేసిన గొప్ప శాస్త్రవేత్త స్వామినాథన్ అని కొనియాడారు. 1965 స్వామినాథన్ ఆధ్వర్యంలో హరిత విప్లవం ప్రారంభించారని, వరి, గోధుమల అధికోత్పత్తి వంగడాల వినియోగం ద్వారా విత్తన వినియోగంలో పెను మార్పులు తెచ్చారన్నారు. అదేవిధంగా భూ సంస్కరణల అమలుకు కృషి చేశారని తెలిపారు. ఆహార ధాన్యాల లోటులో ఉన్న భారతదేశం1985 నాటికి ఎగుమతి చేసే దేశంగా ఎదిగేలా కృషి చేశారని వివరించారు. వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకువచ్చి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ఆయన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, మండల కార్యదర్శి వెంకటేశం రైతులు చంద్రయ్య, మల్లేశంగౌడ్, మొగులయ్య, అమృతమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఫ్యాషన్ డిజైన్, టెక్నాలజీ ట్రేడ్‌కు సంబంధించి పూర్తి తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయస్సు 21 ఏళ్లు నిండి ఉండి యూజీసీ నుంచి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఫ్యాషన్ డిజైనింగ్/ టెక్నాలజీలో బ్యాచ్లర్ ఆఫ్ వొకేషనల్ డిగ్రీ (4 ఏళ్లు) ఉండాలన్నారు. సంబంధిత ఫీల్డ్ లో ఏడాది అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. లేదా (మూడేళ్లు) బ్యాచ్లర్ ఆఫ్ ఒకేషనల్ డిగ్రీతో పాటు రెండేళ్ల అనుభవం కలిగి ఉండాలని/ గుర్తింపు పొందిన ఎడ్యుకేషన్ బోర్డ్ నుంచి ఫ్యాషన్ డిజైనింగ్/టెక్నాలజీ/సీడీడీఎంలో మూడేళ్ల డిప్లమా కలిగి ఉండి సంబంధిత రంగంలో రెండేళ్ల అనుభవం ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు అక్టోబర్, 9లోపు కళాశాలతో పాటు సంగారెడ్డి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9848935146 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

గిరిజనుల దీక్షాధారణ



కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలంలోని బల్కంచెల్క తండా (భక్తిధాం తండా)లో శనివారం గిరిజనులు భవానీమాత దీక్షలు చేపట్టారు. తండాలోని విశ్వపాళిని భవానీ సమేత సేవాలాల్ మహరాజ్ మందిరంలో ధర్మకర్త, మేడ్చల్ జిల్లా రవాణాశాఖ అధికారి మూడ్ కిషన్ లలిత దంపతుల ఆధ్వర్యంలో 21 రోజుల అర్ధమండల దీక్షలు చేపట్టారు. కోండాపూర్ ఆశ్రమ పిఠాధిపతి సంగ్రామ్ మహరాజ్ చేతుల మీదుగా మాలధారణ చేయించారు. కార్యక్రమంలో గిరిజన ప్రముఖులు రాములు, జైల్‌సింగ్, రూప్‌సింగ్, శంకర్, సవాయ్ సింగ్, మన్మోహన్‌నాయక్, కిషన్, పండరి, నరేందర్ పాల్గొన్నారు.

4న వయోవృద్ధులతో సమావేశం

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని వయోవృద్ధులతో ఈ నెల 4న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని కలెక్టరేట్‌లో వయోవృద్ధుల కమిటీ సభ్యులు, వయోవృద్ధులతో సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి సంధ్యారాణి తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని వృద్ధులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

యువకుల అరెస్టు సరికాదు

నారాయణఖేడ్: కామారెడ్డిలో నిర్వహించిన ఏక్తాయాత్రకు వెళుతున్న కైతి లంబాడీ యువకులను ఎక్కడికక్కడ అరెస్టు చేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధుర కైతి లంబాడీలను ఎస్టీ జాబితాలో చేరుస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

తాగునీటి సరఫరా నిలిపివేత

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణానికి వచ్చే మంచినీటి సరఫరా రెండు రోజుల పాటు నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. సంగారెడ్డి మండలం కలబ్ గూర్ మంజీరా డ్యామ్ నుంచి పట్టణానికి వచ్చే ప్రధాన పైప్ లైన్ పగిలిపోవడంతో సంగారెడ్డి పట్టణానికి వచ్చే మంచినీటి సరఫరా శనివారం నిలిచిపోయిందన్నారు. మరో రెండు రోజులపాటు నీటి సరఫరా ఉండదని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని మున్సిపల్ అధికారులు సూచించారు.

కంప్యూటర్ ఆపరేటర్ల ధర్నా

సంగారెడ్డి టౌన్: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఈ- పంచాయతీ ఆపరేటర్లు శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు చేసి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వసతులు కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు.

అన్ని మతాలకు ప్రాధాన్యం

జహీరాబాద్ టౌన్: సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం దూపదీప నైవేద్యం కింద అర్చకులకు ఇచ్చే గౌరవభృతి రూ.6వేల నుంచి రూ.10 వేలకు పెంచిన సందర్భంగా సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్ గుప్తా అన్నారు. పట్టణంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని మతాలు, కులాలకు గౌరవం ఇస్తున్నారని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, పాండు ముదిరాజ్, సందీప్ రాజ్, శివసాయి, నరేందర్‌రెడ్డి, ప్రశాంత్ దేశ్‌పాండే,శ్రీకాంత్, ఉదయ్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని కిచ్చన్నపల్లిలోని లక్ష్మీవేంకటేశ్వర ఆలయ పునర్నిర్మాణ పనులకు రూ.95 లక్షల నిధులను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు మంజూరు చేసిందని జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగా జోగినాథ్ గుప్తా తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిధుల మంజూరుకు కృషి చేసిన టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, సహకరించిన మాజీ బోర్డు సభ్యుడు జీవన్‌రెడ్డి, మాజీ ఎల్‌ఏసీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సలహాదారుడు కొండల్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

గణపతి ఆశీస్సులు అందరిపై ఉండాలి



హత్నూర (సంగారెడ్డి): గణపతి ఆశీస్సులు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాలి అనిల్‌కుమార్ అన్నారు. హత్నూరలోని ఒకటో వార్డులో వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద గాలి అనిల్ కుమార్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, రాష్ట్ర నాయకులు రవీందర్‌రెడ్డి, సర్పంచ్ వీరస్వామిగౌడ్, మాజీ సర్పంచ్ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



నందకిషోర్

పటాన్‌చెరు టౌన్: విద్యార్థి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఇతని కుమారుడు నందకిషోర్ (15) దిగ్వల్ హాస్టల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఇటీవల నందకిషోర్‌కు జ్వరం రావడంతో వారం రోజుల క్రితం ఇంటికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో 29వ తేదీ సాయంత్రం తన సోదరి పద్మరాణితో ఇస్నాపూర్ చౌరస్తాకు ఇద్దరు కలిసి మెడికల్ షాప్‌నకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చే సమయంలో నందకిషోర్ నేను కొద్దిసేపు ఆగి ఇంటికి వస్తానని చెప్పి తన సోదరిని ఇంటికి పంపించాడు. రాత్రి అయిన ఎంతకూ తిరిగిరాకపోవడంతో నందకిషోర్ కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో నందకిషోర్‌రెడ్డి తండ్రి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.